# మంచివాని చెడ్డతనం

పాపారావంత మంచివాడు లేడని అతను ఆ వూరువచ్చిన మొదటిలో అందరూ అనుకుండేవారు. చుట్టుపక్కల ఎవరి యింట్లోనైనా కష్టమొస్తే **అతను** అందరికన్నా ముందు హాజరవడం, వారి కష్టాలు పంచుకుంటూ తగిన సహాయం చెయ్యడం తరచు అందరికీ తెలిసిన విషయం. అతని యింటికి వచ్చిన ముష్టివాడుకాని, అతిథికాని ఎప్పుడూ వట్టిచేతులతో తిరిగి వెళ్ళేవాడుకాదు. అతని ఆదరణ, సహాయం అందరూ వేనోళ్ళ పొగడుతూండేవారు

పాపారావుతప్ప మరొకరు సహాయంచేస్తారనే ఆశలేక విశ్వనాథం అతనిదగ్గరకువచ్చాడు. ఎదురుగావున్న కుర్చీమీద కూర్చోమని ఆహ్వానిస్తూ కాఫీ యిచ్చి ఆదరించాడు పాపారావు

“మీ వద్దకు ఒక సహాయంకోసం వచ్చాను” అన్నాడు విశ్వనాథం ఉబికివచ్చే బాధ అణగద్రొక్కే కంఠంతో.

“చెప్పునాయనా, నాకు చేతనైన సహాయం చేస్తాను” అన్నాడు పాపారావు.

“మా నాన్నగారు నన్ను ఇంట్లోంచి గెంటేశారు” అంటూ తన కష్టాల చరిత్రకు నాంది చెప్పుకున్నాడు విశ్వనాథం.

“అరరే! ఎందుకు గెంటేశారు?”

"మీకందరికీ తెలిసేఉంటుంది. మాసవతితల్లి నన్ను నానా బాధలు పెడుతోంది. చిన్నవిషయాలపై పేచీలు పెంచి మా నాన్నకు నామీద ఫిర్యాదులు చెప్పి కొట్టిస్తోంది. ఇంట్లో తిండి సరిగా పెట్టటంలేదు. నేను చదువుకొనే సమయంలో ఏవో పనులు చెప్పి, నా చదువు పాడుచేసేది, మొన్న నా బి. ఏ. పరీక్షపోయింది. చదువుమీద శ్రిద్ధలేక బోలెడు డబ్బు తగల బెట్టానని మా నాన్నకు కోపం తెప్పించింది. ఆయన నన్ను చావగొట్టారు. ఆ దెబ్బలు భరించలేక సవతితల్లి నన్ను యింట్లో నానా బాధలు పెడుతోందని నాన్నగారికి చెప్పాను ఆవిడకు నామీద కోపంవచ్చింది. ఆవిడ శీలాన్ని చెరచడానికి నేను దొంగచూపులతో ప్రియత్నిస్తున్నానని మా నాన్నతో చెప్పి నన్ను ఇంట్లోంచి గెంటించేసింది" అంటూ ముగించాడు విశ్వ నాథం తన బాధలచరిత్ర.

"పాపం!" అని సానుభూతి చూపించాడు పాపారావు.

"మీ రేదైనా రెండువందల రూపాయిలు సహాయం చేస్తే నా చదువు పూర్తిచేసుకుని ఎక్కడైనా ఉద్యోగం సంపా దించుకుని మీ సొమ్ము తిరిగి యిచ్చేస్తాను" అంటూ ప్రాధేయ పడ్డాడు విశ్వనాథం.

పాపారావుకు విశ్వనాథం పరిస్థితిచూస్తే గుండె కరిగింది. విశ్వనాథం, అతని తండ్రి కృష్ణారావు చాలారోజులనుంచి బాగా తెలుసు పాపారావుకు. విశ్వనాథం ఎంతో బుద్ధిమంతుడని విన్నాడుకూడా. కృష్ణారావు మూడోభార్య సవతికొడుకును

నానా కష్టాలు పెడుతున్నట్లు నల్గురూ చెబితే వినడమే కాని స్వయంగా ఎప్పుడూ చూడలేదు. ఈరోజు విశ్వనాథం సహాయంకోసం ప్రాధేయపడుతుంటే, అదంతా నిజమేకావచ్చు నని నమ్మాడు పాపారావు.

"కృష్ణారావుగారంతటి మంచిమనిషి నిన్ను యింట్లోంచి గెంటెయ్యడం చాలా అన్యాయం" అన్నాడు పాపారావు.

"ఆడదిమాటలువిన్న ప్రతీమొగవాడూ అలాగేచేస్తాడు. నిజానిజాలు తెలిస్తేగాని చేసినపనిలోని మంచిచెడ్డలు తెలియవు. ఆయన్ని నిందించి పనిలేదు. ఈః కాస్త సహాయంచేస్తే మీమేలు మరిచిపోను" అంటూ వేడుకున్నాడు విశ్వనాథం.

"పోనీ మీ నాన్నగారితో మాట్లాడి నీ పరిస్థితిని చక్క-చేస్తానోయి" అన్నాడు పాపారావు.

"విచక్షణాజ్ఞానం లేకుండా ఆడదాని బానిసలా ప్రవర్తించే ఆయన్నిగురించి నాతో ఏమీ చెప్పకండి. నా బాధలు నేను పడతాను" అంటూ లోపల ఉడికిపోతున్న కోపం వెళ్ళగ్రక్కాడు విశ్వనాథం.

అనవసరంగా వారి సంసారగొడవలలో కలుగచేసుకునే దానికన్నా ఆపత్తులోవున్న విశ్వనాధానికి కాస్త సహాయం చేయడమే మంచిదనిపించింది పాపారావుకు.

పాపారావు యిచ్చిన రొక్కం తీసుకుని వీలైనంత త్వరలో వాపసుచేస్తానని వాగ్దానమిచ్చి, ఆ పట్నంలో మరో దూరపుబంధువు యింట్లో చదువుకుని కాలక్షేపం చేస్తానంటూ వెళ్ళిపోయాడు విశ్వనాథం.

(10)

పాపారావు విశ్వనాథానికి సహాయం చేసినట్లు, ఆనోటా ఆనోటాపాకి, కృష్ణారావు భార్యచెవిలో పడింది. ఆవిడ త్రాచు పాములా పగబట్టినట్లులేచి, భర్తవద్దకువెళ్ళి "ఏమండీ చూశారా! చేసిన వెధవపనులకు కోపంవచ్చి, ఎప్పటికైనా బుద్ధివస్తుందని మీా అబ్బాయిని యింట్లోంచి పొమ్మని కూకలేస్తే ఆ పాపారావు వాడికి డబ్బు యిచ్చి ఆదుకుంటున్నాడుట. అలా అందరూ ఆదుకుంటుంటే; మీా అబ్బాయి మీా మాట వింటాడా? అయినా ఇంకొకరి సంసారగొడవలలో కలగజేసుకుని తండ్రి కొడుకుల మధ్య తగాదాలు పెంచేమనిషి ఏం పెద్దమనిషండీ!" అంటూ సాగదీసింది.

పెళ్ళాం మాటలు వేదవాక్యాలుగానమ్మే కృష్ణారావుకు పాపారావు నిజంగా తనకి అపకారం తలపెట్టినట్లు కనిపించాడు. తల్లి శీలం చెరచడానికి ప్రయత్నించే నీచమైన కొడుకును చేర దీసి ఆదరించే పాపారావు ప్రవర్తనలో ఏదో దుర్బుద్ధి ఉన్నట్లు స్ఫురించింది. అప్పటినుంచి పాపారావు పలకరించినా కృష్ణారావు మాట్లాడడం మానేశాడు. ఇదిచూసి పాపారావు కొంచెం ఆశ్చర్యపోయాడు. కాని కొడుకును హింసించే తండ్రితో ఎక్కువ పరిచయంకూడ మంచిదికాదని ముభావంగా ఊరు కున్నాడు. కాలం గడిచినకొలదీ వారిద్దరిమధ్యా రాకపోకలు, మాటా, మంతీ ఆగిపోయాయి.

* * * *

విశ్వనాథం పరీక్ష ప్యాసయ్యాడు. అతనికి ఒక ఉద్యోగం యిప్పించాడు పాపారావు. ఉద్యోగంలో చేరాక అప్పుగాతీసు

కున్న డబ్బు విశ్వనాథం వాపసుచేశాడు పాపారావుకు. విశ్వనాథం తన సహాయంవల్ల బాగుపడ్డాడుకదా అని అతను చాలా సంతోషించాడు. తరువాత విశ్వనాథం పెళ్ళికూడా పాపారావు చేతులమీదుగ జరిగింది. అందుకు ఎంతో కృతజ్ఞత చూపించు కున్నాడు విశ్వనాథం.

రోజులు గడిచినకొలదీ పాపారావు విశ్వనాథానికి సహాయం చేస్తూండడంవల్ల, కొడుకు తిరిగి యింటికి రాకపోవడం వల్ల కృష్ణారావుకు, ఆయన భార్యకు ఉక్రోషం పెరిగిపోతూంది. కనిపించిన ప్రతీవాడిదగ్గరా పాపారావంత కుత్సితబుద్ధి, మిత్రి ద్రోహి లేడని తన బంధువుల పిల్లనిచ్చి పెళ్ళిచేయాలనే ఉద్దేశ్యంతోటే తనకొడుక్కు మొదట సహాయంచేశాడని, తండ్రి-కొడుకుల మధ్య తగాదాలు పెంచుతున్నాడని, ఇష్టంవచ్చినట్లు ప్రచారం చేయసాగారు. పాపారావు యిదంతా విన్నాడు. నిజం నిలకడమీద తెలుస్తుందని ఊరుకున్నాడు. పాపారావు దగ్గరనుంచి ఎదురుప్రచారం లేకపోవడంవల్ల కృష్ణారావు మాట నిజమని అంతా నమ్మి పాపారావంత చెడ్డవాడు మరొకడు లేడని అంతా అనుకోసాగారు.

* * * *

కృష్ణారావు భార్యాసహితంగా ఒకనాడు కాశీయాత్రకు బయలుదేరాడు. కాశీ విశ్వనాథుని దర్శనం చేసుకుని భార్యను వెంటవేసుకుని బజారులోంచి వస్తూ వెనక్కి తిరిగి చూసేటప్పటికి భార్య కనిపించలేదు. చుట్టూవున్న జనసమ్మర్దంలో భార్య

దారితప్పి మారిపోయిందేమో అని అంతా వెదికాడు. కాని లాభం లేకపోయింది. పోలీసులకు రిపోర్టుయిచ్చాడు. అప్పటికీ దొరకలేదు. ఊరంతా స్వయంగా గాలించాడు. కాని ఎక్కడా ఆమెజాడ కనిపించలేదు. భార్యను వెదుకుతూ కాశీలోనే పది రోజులుండగా ఒకరోజు ఆమెదగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. ముసలి భర్తతో కాపురం చెయ్యలేక వేఱొక పడుచుభర్తని కాశీలోనే చూసుకున్నానని, తన్నుగురించి వెతికే ప్రియత్నం చెయ్యవద్దని అందులో వ్రాసింది. ఇటువంటి ఘోరం జరుగుతుందని కాని, జరిగినా యిలా తెగించి ఉత్తరం వ్రాస్తుందని కాని కలలోకూడా అనుకోని కృష్ణారావు అందమైన భార్యను పోగొట్టుకున్నందుకు చాలా దుఃఖించాడు. తరువాత చాలా పశ్చాత్తాపపడ్డాడుకూడా, యిటువంటి భార్యను నమ్మి కన్న కొడుకును ఇంటిలోంచి గెంటేసినందుకు.

కాశీయాత్రి పూర్తిచేసుకుని, పశ్చాత్తాపంతో కృంగిపోయి తిన్నగా కొడుకుదగ్గరకు బయలుదేరాడు కృష్ణారావు. తన్ను ఎన్నోకష్టాలు పాలుచేసిన తండ్రిని జన్మలో చూడనని ప్రతినపట్టాడు విశ్వనాథం. తండ్రిని చూడగానే "నా గుమ్మం తొక్కద్దు" అని గెంటేశాడు. కొడుకు యింటికిరాగానే యింత పరాభవం జరగడంవల్ల జరిగిన చరిత్రి చెప్పుకునే సావకాశం లేక తిరుగుముఖం పట్టాడు కృష్ణారావు.

కొడుకు విషయంలో అనవసరంగా పాపారావుతో మునుపటిస్నేహం చెడగొట్టుకున్నందుకు విచారిస్తూ, తన పశ్చా

త్తాపం వెళ్ళబోసుకుందామని పాపారావు యింటికి బయలు దేరాడు కృష్ణారావు.

గుమ్మంలో నిలుచున్న కృష్ణారావును చూసి మొదట ఆశ్చర్యపోయినా మామూలు మంచితనంతో లోనికి ఆహ్వానించాడు పాపారావు. తన గతచరిత్ర, కాశీయాత్ర, కుమారుని తిరస్కరణ విపులంగా చెప్పుకుని ఏడ్చాడు కృష్ణారావు.

కృష్ణారావు ముసలితనంలో యిన్ని కష్టాలుపడడం పాపారావుకు జాలి కలిగించింది. తండ్రి - కొడుకులను కలిపే అవకాశం యిదేనని, అలాచేస్తే, తనపై లోకంమోపే నిందలు కూడా పోతాయని, కొడుకు సుముఖుడయ్యేటట్లు చేస్తానని వాగ్దానమిచ్చాడు పాపారావు.

విశ్వనాథం దగ్గరకువచ్చి "మీ నాన్న జరిగినదానికి పశ్చాత్తాపపడుతున్నాడు. మీ సవతితల్లి కాశీలో ఎవరితోనో లేచిపోయింది. ముసలితనంలో నువ్వు కాస్త ఆయన్ని చూడాలి" అంటూ సలహా యిచ్చాడు.

పాపారావు సలహా విశ్వనాథం చెవికెక్కలేదు. అన్ని సంగతులు తెలిసిన పాపారావే యిటువంటి సలహాలివ్వడం చాలా అసమంజసమనిపించింది విశ్వనాథంకు. తండ్రి తన్ను పెట్టిన బాధలకు ప్రతిఫలం ముసలితనంలో అనుభవించాలని నిశ్చయించాడు విశ్వనాథం. పాపారావు ప్రవర్తన నిరసిస్తూ తన కుటుంబవ్యవహారాలలో జోక్యం కలుగజేసుకోవద్దని అతన్ని తీవ్రంగా మందలించాడు.

విశ్వనాథం మంకుపట్టుచూసి చాలా బాధపడ్డాడు. ఇంట్లో కాచిపెట్టే దిక్కులేని ముసలితండ్రిపై పగసాధించడం చాలా రోతనిపించింది. విశ్వనాథాన్ని విడిచి తిరిగి వచ్చేశాడు.

కృష్ణారావుని పిలిచి పాపారావు అన్నాడు "మిమ్మలిని, మీ కొడుకును కలుపడానికి నా ప్రయత్నం అంతా చేశాను. కాని అది వ్యర్థమయింది మీ స్థితిచూస్తే చాలా జాలివేస్తోంది. ముసలితనంలో మిమ్మలిని కనిపెట్టి చూసేబాధ్యత నాపై పెట్టుకుంటాను. ఇప్పటినుంచి మీరు మా యింట్లోనే వుండండి" అని.

పాపారావు ఆదరణ వాక్యాలు, మంచితనంచూసి కృష్ణారావు పరమానందభరితుడయ్యాడు. అప్పటినుంచీ ఆయన పాపారావుయింట్లో కలిసిమెలిసి జీవిస్తున్నాడు.

విశ్వనాథానికి ఈ సంగతి తెలిసింది. తన తండ్రికి తన యింట్లో తావిచ్చినందుకు పాపారావుపై తగనికోపం వచ్చింది విశ్వనాథంకు. తండ్రికీ, తనకీ యింకా విరోధాలు పెంచడానికి ఆఖరి రోజులలో చాకిరీచేసి ఆస్తి అనంతరం పొందడానికి తండ్రిని ఇంట్లోపెట్టుకుని ఎత్తువేశాడని పాపారావుపై ప్రచారం ప్రారంభించాడు విశ్వనాథం.

విశ్వనాథం ప్రచారం బాగా ప్రాకిపోయింది. అలవాటు లేక ఎదురుప్రచారం చేయలేదు పాపారావు. పాపారావంత పరమదుర్మార్గుడు మరొకడు లేడని అంతా అనుకోసాగారు. అప్పుడుమాత్రమే మనుకున్నాడు పాపారావు నిజం నిలకడమీద కూడా తెలియకపోదని.